

# పుస్తక పరిచయం




Writer
G1, Habeeb Beema Mansion
Jaffer Alibagh, Somajiguda
HYDERABAD- 500 082
Phone: 96189 51250

**మన్నెం శారదగారిని** తెలుగుపాఠకులకు, ముఖ్యంగా కౌముది పాఠకులకు, ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరంలేదు. 1980-90 దశకాల్లో శారదగారి రచనలేని పత్రిక ఉండేది కాదు అనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. అతిచిన్న వయసునుంచే రచనలు ప్రారంభించిన శారదగారు ఇప్పటికీ ఏ మాత్రం పదునుతగ్గని రచనాశక్తితో కథా, నవలా రచనలను కొనసాగిస్తున్నారు. శారదగారు ఇప్పటివరకూ వెయ్యికిపైగా కథలు వ్రాశానని ముందుమాటలో గుర్తుచేసుకున్నారు. వాటిలోంచి లభ్యమైన 36 కథలను ఈ సంపుటిగా మనముందుకు తీసుకొచ్చారు. ఈ కథల రచనాకాలంలో వ్యవధి కొన్ని దశాబ్దాలు ఉన్నా శైలిలోకానీ, వస్తువులోకానీ అత్యుత్తమప్రమాణాలు అలానే నిలిచిఉండడం గమనించదగ్గ విశేషం, రచయిత్రిగా మన్నెం శారదగారి స్థాయికి ఇది నిలువెత్తు నిదర్శనం. శారదగారి కథా, నవలా రచనలను గమనిస్తే కనిపించే ప్రమాణాలు కొన్ని - అత్యంత సులువైన, సరళమైన వాక్యనిర్మాణం, అనవసరమైన వాక్యాలుకానీ, సన్నివేశాలు కానీ లేకుండా రచన మొత్తం ఒక తూకంతో సాగడం, పాత్రల వ్యక్తిత్వ చిత్రణ, స్క్రీన్‌ప్లే తరహా సన్నివేశాల రూపకల్పన, సంభాషణలు ఆయా పాత్రలు మాట్లాడినట్లే ఉండడం (ఎక్కడా రచయిత్రి కనిపించకుండా) , కథ ఎత్తుగడా, ముగింపూ, అవసరమైన చోట చెప్పీచెప్పకుండా చెప్పి కొంత ఊహని పాఠకులకు వదిలేసి 'అద్భుతం!' అనిపించే భావన కలిగించడం.. మొదలైనవి. అతిచిన్న కథలో వచ్చే పరిమితమైన పాత్రల విషయంలో కూడ చాలా తక్కువ వాక్యాల్లో వ్యక్తిత్వ చిత్రణను కళ్ళముందు నిలబెట్టడం. వీటన్నింటికీ ఉదాహరణలు చెప్పాలంటే ప్రతి కథనూ పేర్కొనాలి. కథ చదవడం ముగించాక కూడా పాఠకుల మనసుల్ని వెంటాడడం - అత్యుత్తమ కథల లక్షణం అనుకుంటే 1981 లోనే శారదగారు వ్రాసిన 'ముక్తి' కథ చక్కటి ఉదాహరణ. 'ప్రేమ ఓడిపోదు' - చాలామంది వ్రాసేసిన కథావస్తువును సరికొత్త కోణంలో ముగించి 'ఇదీ రచయిత్రి ప్రతిభ' అనిపిస్తారు. పరిస్థితుల ప్రభావం వల్ల విడిపోయిన ప్రేమికులు కొన్ని దశాబ్దాల తర్వాత కలుసుకున్నాక జరిగిన పరిణామం - ఇదీ ఈ కథలోని సరికొత్త ముగింపు. ఈ సంపుటిలోని మంచికథలు కొన్ని చెప్పండి అంటే ప్రతి ఒక్క కథనూ పేర్కొనాలి. కేవలం కాలక్షేపానికి కాక సున్నితమైన హృదయస్పందనలకోసం, తెలుగు భాష, కథ అందాలకోసం తప్పనిసరిగా చదవాల్సినవి ఈ 36 కథలూ కూడా. 'మంచి కథ వ్రాయడం ఎలా?' అని ఎవరైనా పరిశోధనా వ్యాసం వ్రాయాలనుకుంటే - ఇందులోని ప్రతి కథనూ ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. కొత్తగా కథలు వ్రాస్తున్న వారికి మార్గదర్శకంగా చూపించదగ్గ కథలు ఇవన్నీ. రచయిత్రి శారదగారు తెలుగుకథా ప్రపంచంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారెప్పుడో..! ★★★




*For Copies*
**Dr. Bheempalli Srikanth**
**8-5-38 Teachers Colony**
**Mahaboob Nagar – 509 001**
**Phone: 9032844017**

**తెలంగాణా రాష్ట్రం** ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలమూరు సాహితి మహిళా విభాగం మరియు జాతీయ సాహిత్య పరిషత్తు సంస్థల ఆధ్వర్యంలో, పాలమూరులో 2019 మార్చి 9-10 తేదీలలో, రాష్ట్రస్థాయి సాహిత్య సదస్సు మరియు కవి సమ్మేళనం నిర్వహించారు. ఆ కవిసమ్మేళనంలో 200 పైగా కవయిత్రులు పాల్గొన్నారు. వారు ఆ సమావేశంలో చదివిన కవితలన్నింటినీ కలిపి సమావేశానికి ముందుగానే పుస్తకరూపంలో ప్రచురించారు. ఇదొక వినూత్నమైన ఆలోచన, బృహత్తరమైన ప్రణాళిక. 'ఈ తెలంగాణా మహిళ' కవితా సంకలనానికి ప్రధాన సంపాదకులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిగారు కాగా, సంపాదకులుగా డా.పొద్దుటూరి ఎల్లారెడ్డి, డా.భీంపల్లి శ్రీకాంత్, డా.గుంటి గోపి, రావూరి వనజ, జి.శాంతారెడ్డి, కొప్పోలు యాదయ్య బాధ్యతలు వహించారు. ఈ సందర్భంగా డా.నందిని సిద్ధారెడ్డి, డా.ఏనుగు నరసింహారెడ్డి లాంటి సాహితీప్రముఖులు ఈ పుస్తకంలోని కవితలను చక్కగా సమీక్షించారు. 209 కవితలున్న ఈ పుస్తకం, పేరుకు తగినట్లుగానే అందరూ కవయిత్రుల రచనలతోనే రూపుదిద్దుకుంది. ఇందులో సుప్రసిద్ధమైన కవయిత్రులతోబాటు వర్ధమాన, ఔత్సాహిక కవయిత్రుల రచనలుకూడా చెప్పుకోద్ద సంఖ్యలో ఉన్నాయి. అత్యధిక శాతం కవితా వస్తువు మహిళ, మహిళాశక్తి, మహిళల హక్కులు, సమాజంలో మహిళల ప్రాధాన్యత, మహిళ సమస్యలు. అతికొద్ది కవితలలో కర్షకుడు, స్వాతంత్ర్యం లాంటి అంశాలను కూడా స్పృశించారు. మొట్టమొదటి కవితే ఆర్ద్రపూరితంగా మొదలైంది. ' పిల్లలు లేకుంటే పరేషానీ / పిల్లల్ని కంటే పరేషానీ / మొగతనానికి మచ్చ మొదటిది / మెడకు గుదిబండ అనుకునుడు రెండోది' - 'ఆమె లేని జీవితం పంటకురాని పొలం / ఆమెతో జీవితం ఇంటికి వచ్చిన వాయినం / పిడికెడు ఆప్యాయతనివ్వు / గంపెడు ఆనందాన్ని పొందేవు నువ్వు' అంటారు మాతృమూర్తి గురించి డా.కొండపల్లి నీహారిణిగారు. హృదయానికి హత్తుకునే వాక్యాలు ఈ సంకలనంలోని కవితల్లో ఎక్కువగానే చోటుచేసుకున్నాయి . 'అలవాటు అవసరమై / అవసరం వ్యసనం అయిన చోట / మనిషీ! తిరిగి చూడు అని / వేడుకుంటున్నాను' (డా.తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి- మునుపటి కాలానికై) ; 'పునరపి జననం పునరపి మరణం / బీజాక్షరాలుగా మారిన ఈ నేలలో / మళ్ళీ పుట్టేందుకు భయంగా ఉంది / నా కెందుకో ఇంకోగ్రహం వెతుక్కోవాలని ఉంది' ( నిర్మలకుమారి - ఆకాశంలో సగం నేను). నినాదాలు ప్రకటనలతో నిండిన కవితలు కూడా ఈ సంకలనంలో తరచూ చోటుచేసుకున్నాయి ' సాధ్యాసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న / మహిళాశిరోమణులందరికీ వందనచందనాలు ' (డా.బండారి సుజాత -మహిళామణులు) ; 'శౌర్యధనుడా.. ఈ భారతీయుడా / తగదు నీకిది తక్షణమే నడుము బిగించి / తరిమేయ్ ఈ స్వయంపీడితమనే కుసంస్కారాలను / నిలబెట్టు నీ జాతి గౌరవం' ( డా.మంగళ మక్కపాటి- తరిమేయ్.. ఈ స్వయంపీడితాన్ని); 'చేయూత కోరినవారికి చేతులందించాక / ఎన్నిజన్మలకైనా చెలిమి కలిమే మిగిలేనురా'( లక్ష్మీ వేణుగోపాల్ - ఊసులు). పద్యాలు, పూర్తివచనంలా సాగిన కవితలూ కూడా ఈ సంకలనంలో ఎదురౌతాయి. ఇంతచక్కటి సంకలాన్ని అత్యంత సుందరమైన గ్రంథరూపంలో తీసుకొచ్చిన సారథులందరినీ అభినందించి తీరాలి.

★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**